సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 25 । మే । 2025



ఉగ్రవాద నిర్మూలనలో కేంద్రం విఫలం 8లో



మలేసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 'విశాఖ' ప్రతిభ 8లో

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొండా రాజీవ్



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొండా రాజీవ్ గాంధీని నియమించారు. శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆరోగ్య యోగం



8లో

ఇది సర్కస్ కాదు... రోడ్డు పై రిస్క్

అవునండి.. ఇది ఒలింపిక్స్‌లో బైక్ స్టంట్స్ కాదు.. మన విశాలమైన రోడ్ల మీద ఓ వ్యక్తి విన్యాసం.. ఒక ద్విచక్రవాహనం, ఒక డ్రైవర్, వెనుక ఆరుగురు పిల్లలు... అబ్బో, నిజంగా ఇది గిన్నిస్ బుక్ రికార్డుకే ఎక్కాలి. కాకపోతే అది 'అతి ప్రమాదకరమైన ప్రయాణం'అనే కేటగిరీలో ఉంటుందంతే!.. ముందు ఒక బుడ్డోడు, హ్యాండిల్‌బార్‌ను గట్టిగా పట్టుకుని డ్రైవర్‌కు అతుక్కుపోయి ఉండగా... వెనుక ఐదుగురు చిన్నారులు ఒకరినొకరు పట్టుకుని 'మానవ పిరమిడ్'ను తలపిస్తున్నారు. బండి కాస్తంత ఊగినా అంతే సంగతులు.. వీళ్లంతా ఎక్కడికి వెళ్తున్నారో, ఏమో... బహుశా 'సాహస యాత్ర ' కు కావచ్చు!.. వీరిని చూసిన ప్రజల గుండెలు మాత్రం 'ధక్ ధక్ ' అంటూ డప్పు చప్పుళ్లను మించిపోయాయి. 'ఛ ఛ, ఎంత నిర్లక్ష్యం!' అని కొందరు తలలు పట్టుకుంటే, 'దేవుడా కాపాడు' అని మరికొందరు చేతులు జోడించారు. ఇంతటి సాహసం చేస్తున్న ఆ వ్యక్తికి మాత్రం హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే! కాకపోతే అది 'బాధ్యతారాహిత్యానికి పట్టాభిషేకం' చేసినందుకు మాత్రమే సుమా! ఆయన డ్రైవింగ్ స్కిల్స్‌కు మనం ఎంత మురిసిపోతున్నామో, ఆ పిల్లల భద్రత గురించి అంతకు రెట్టింపు భయపడాలి మరి!.. ఇలాంటి దృశ్యాలు మన రోడ్ల మీద సర్వసాధారణమైపోతే... ఇక ట్రాఫిక్ రూల్స్ బోర్డులకు సెలవు ప్రకటించాల్సిందే! ఎందుకంటే ఇక్కడ నడిచేది వాహనాలు కాదు, 'రిస్క్' తో నిండిన 'మినీ బస్సులు'!.. చివరిగా ఒక్క మాట... ఆ సాహస డ్రైవర్‌కు మనవి. మీ పిల్లలు మీ ప్రపంచం కావచ్చు, కానీ వారి ప్రాణాలతో చెలగాటం ఆడటం ఏ మాత్రం సమర్థనీయం కాదు. కాస్తంత జాగ్రత్త తీసుకుంటే మీరూ క్షేమంగా ఉంటారు, మీ పిల్లలూ క్షేమంగా ఉంటారు! -ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



జ్ఞానాపురం వద్ద సాహస రైడింగ్

పగడపు దిబ్బలకు ముప్పు

కూటమి విధ్వంస రచన

- సముద్ర పర్యావరణంపై వగబట్టిన ప్రభుత్వం
- సంపద సృష్టి కోసం సాగర తీరంలో పర్యాటక ప్రాజెక్టులు
- జీవ వైవిధ్యం కోసం పగడపు దీవుల్ని కాపాడుతున్న ఎన్జీవో సంస్థ ప్లాటిపస్
- పదేళ్లపాటు సంరక్షిస్తే సముద్ర తీర సంరక్షణ
- తిమ్మాపురం నుంచి మంగమారిపేట వరకు విస్తరించిన కోరల్ రీఫ్స్
- ఆ ప్రాంతంలోనే వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు ప్రభుత్వ కుట్ర
- పగడపుదిబ్బల రక్షణ కోసం పోరాటం చేస్తున్న ప్లాటిపస్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం:

ఆంధ్రప్రదేశ్ తీరంలో ఎక్కడా లేని విభిన్న పగడపు దిబ్బలకు చిరునామాగా ఉన్న విశాఖ తీరంలో విధ్వంసకాండకు తెరతీసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోంది. సంపద సృష్టి కోసం.. పర్యాటకం పేరుతో.. పర్యావరణంపై వేటు వేస్తున్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్లాటిపస్ ఎన్‌జీవో సంస్థ సముద్ర గర్భంలో పగడపు దీవుల్ని కాపాడుకుంటూ వస్తోంది. మరో పదేళ్లపాటు వాటిని సంరక్షిస్తే.. మరింత విస్తరించి.. సాగరతీర స్వచ్ఛతతో పాటు.. కోతకు గురయ్యే ప్రమాదం నుంచి కాపాడవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లుగా మంగమారిపేట తీరంలో వాటర్‌స్పోర్ట్స్‌కు టెండర్లు ఆహ్వానించి విధ్వంస రచనకు సంతకం చేస్తుండటంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగడపు దిబ్బల రక్షణ కోసం పోరాటం కొనసాగించేందుకు ప్లాటిపస్ సంస్థ ప్రతినిధులు నడుంబిగించారు.

కోస్తా తీరంలో పగడపు దిబ్బలు అస్సలుండవని గతంలో అనేక సర్వేలు చెప్పినప్పటికీ, ఇటీవల జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధనలు ఆ వాదనను తప్పని నిరూపించాయి. విశాఖ సాగర తీరంలో విభిన్న రకాల కోరల్స్ (పగడపు దిబ్బలు) ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా మంగమారిపేట ప్రాంతంలో సాగరగర్భంలో విభిన్న పగడపు దిబ్బలు ఉన్నట్లు అన్వేషణలో తేలింది. దీని వెనుక ప్లాటిపస్ ఫౌండేషన్ కృషి ఎంతో ఉంది. తిమ్మాపురం, రుషికొండ, మంగమారిపేట మొదలైన ప్రాంతాల్లో నిరంతరం సాగరగర్భ స్వచ్ఛత కోసం ఈ సంస్థ ఏళ్ల తరబడి శ్రమిస్తోంది. సముద్రపు లోతుల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ఇప్పటివరకు 2 లక్షల 60 వేల కిలోల వరకు తొలగించారు. అక్కడ ఉన్న పగడపు దిబ్బలను సంరక్షిస్తూ వాటి అభివృద్ధి కోసం స్కూబా డైవర్లతో కలిసి నిరంతరం కృషి చేయడంతో మంగమారిపేట, తిమ్మాపురం ప్రాంతాల్లో ఇవి విస్తరించాయి. స్కెలరాక్టినియా కోరల్స్, పవోనా ఎస్‌పీ, లిథోఫిలాన్ ఎస్‌పీ, మోంటీపోరా ఎస్‌పీ, పోరిటిస్ ఎస్‌పీ, హెక్సాకోరిలియా, ఆక్టోకోరలియా, డిస్కోసోమా, లోబాక్టిస్ వంటి అరుదైన పగడపు దిబ్బలు విస్తారంగా ఉన్నాయి.




పగడపుదిబ్బల్ని సంరక్షిస్తున్న ప్లాటిపస్ స్కూబా డైవర్లు



మంగమారిపేట సముద్ర గర్భంలో ప్లాస్టిక్ వ్యర్థాల్ని తొలగిస్తున్న ప్లాటిపస్ ప్రతినిధులు

జీవవైవిధ్యానికి ప్రతిరూపాలు



ఈ కోరల్స్ ద్వారా సముద్ర జీవజాలాన్ని సంరక్షించుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సముద్ర గర్భంలో పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలుగా పగడపు దిబ్బలను పిలుస్తారు. పగడాల ద్వారా స్రవించే కాల్షియం కార్బోనేట్ నిర్మాణాల వల్ల ఇవి ఏర్పడతాయి. ఇవి అనేక పోషకాలను కలిగి ఉంటాయి. పగడపు దిబ్బలు సముద్రగర్భంలో అత్యంత వైవిధ్యమైన పర్యావరణ వ్యవస్థలను ఏర్పరుస్తాయి. ఇవి ఉంటే సముద్ర జీవరాశులు ఎక్కువగా వృద్ధి చెందడానికి ఉపయోగపడతాయి. సముద్రంలోని చేపలతో పాటు 25 శాతం జీవులకు సముద్ర వర్షారణ్యాలు అని పిలిచే పగడపు దిబ్బలే ఆవాసాలు. రంగురంగుల చేపల నుంచి గంభీరమైన సముద్ర తాబేళ్ల వరకు లెక్కలేనన్ని జాతులకు ఇవి కీలకమైన ఆశ్రయం, సంతానోత్పత్తి ప్రదేశాలుగా మారి ఆహార వనరులను అందిస్తాయి. చేపలు, మొలస్కా, ఇతర జీవజాతులు, క్రస్టేసియన్లు, స్పాంజ్‌లు మొదలైన సముద్ర జాతుల ఉత్పత్తి పెరిగేందుకు ఇవి అనువైన వాతావరణాన్ని అందిస్తాయి.

'కూటమి' కాసుల కక్కుర్తికి బలి!

తీరప్రాంత నిర్మాణాలు పెరగడం, ఉష్ణోగ్రతలు పెరగడం కారణంగా ఇప్పటికే 33 శాతం పగడాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వాతావరణ మార్పులు, విధ్వంసకర మానవ చర్యల వల్ల వీటి మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. తీరప్రాంతాన్ని రక్షించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ప్లాటిపస్ సంస్థ ఈ పగడపు దిబ్బలను సంరక్షిస్తోంది. అయితే ఇలాంటి అరుదైన ప్రాంతంపై ఇప్పుడు కొందరు కూటమి నేతల కన్ను పడింది. సంపద సృష్టి పేరుతో తిమ్మాపురం నుంచి మంగమారిపేట వరకు ఆక్వా స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. వాస్తవానికి ఈ ప్రాంతం వాటర్‌స్పోర్ట్స్‌కు అనువుగా లేకపోయినా కేవలం కొన్ని సంస్థలకు భూములు కట్టబెట్టేందుకే పర్యాటక శాఖ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. టూరిజం మంత్రి అండదండలున్న ఒక సంస్థ కోసం పగడపు దిబ్బలను నాశనం చేసేందుకు సిద్ధమవుతున్నారని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పగడపు దిబ్బలను సంరక్షించేందుకు ప్లాటిపస్ ఫౌండేషన్ సంస్థ పోరాటానికి సిద్ధమైంది. ఈ ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ వద్దని, వాటిని వేరే ప్రాంతానికి తరలించాలని వారు అధికారులను కోరుతున్నారు.

పదేళ్లపాటు సంరక్షించుకోవాలి



కొన్ని తీర ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించి ఆక్వా స్పోర్ట్స్ అభివృద్ధి కోసం ప్రయత్నించడం మంచి పరిణామమే. కానీ అత్యంత అరుదైన, జీవవైవిధ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేసే పగడపు దిబ్బలు ఉన్న ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయడం మాత్రం తగదు. గత కొన్నేళ్లుగా మంగమారిపేట ప్రాంతంలో కోరల్ రీఫ్స్‌ను పెంచుతూ వస్తున్నాం. వీటిని మరో పదేళ్లపాటు సంరక్షించుకుంటే ఈ ప్రాంత సముద్ర తీరం మరింత ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ ఆక్వా స్పోర్ట్స్ ఏర్పాటు చేయకుండా పగడపు దిబ్బలను కాపాడేందుకు మాత్రమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ప్లాటిపస్ ఫౌండేషన్ సంస్థ పోరాటానికి వెనుకాడదు. ఈ ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ వద్దని, వాటిని వేరే ప్రాంతానికి తరలించాలని అధికారులను కోరుతున్నాం.

– సుభాష్ చంద్రన్, ప్లాటిపస్ ఫౌండేషన్ ప్రతినిధి

ఏయూలో 'అతిథి'పోరు

- గెస్ట్ ఫ్యాకల్టీల తొలగింపునకు కసరత్తు
- కొంపముంచిన కూటమి నేతల సిఫార్సు
- పాఠాలు చెప్పే ఫ్యాకల్టీలకు తప్పని పరీక్ష



విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులపై వర్సిటీ పాలనాధికారులు చిన్నచూపు చూస్తున్నారా..? నెలవారీ వేతనాలు ఇవ్వాలనే డిమాండ్ మరుగునపడేలా అతిథి అధ్యాపకులకు బోధనా సామర్థ్యానికి పరీక్ష పేరిట బెదిరింపులకు పాల్పడుతున్నారా...?. వచ్చే విద్యా సంవత్సరంలో గెస్ట్ ఫ్యాకల్టీలను సగానికి పైగా తగ్గించుకునేందుకు కసరత్తు చేస్తున్నారా..?. ప్రస్తుతం జరుగుతోన్న పరిణామాలతో ఏయూలో ఇదే చర్చసాగుతోంది. పీహెచ్‌డీ అర్హతలతో ఏళ్ల తరబడి పాఠాలు చెబుతున్న తమను అవమానపరిచేలా వర్సిటీ పాలనాధికారుల వ్యవహరిస్తున్న తీరుపై అతిథి అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు. భవిష్యత్ కార్యాచరణపై శనివారం వర్సిటీ ప్రాంగణంలో సమావేశమైన అతిథి అధ్యాపకులు, దీనిపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై సమాలోచనలు చేశారు.

ఏయూలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత

ఆంధ్ర యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. ఒకప్పుడు 1,200 మంది వరకు ఉన్న రెగ్యులర్ అధ్యాపకుల సంఖ్య ప్రస్తుతం 200 లోపుకి చేరుకుంది. దీంతో తరగతుల నిర్వహణ కోసం దాదాపు 400 మంది గెస్ట్ ఫ్యాకల్టీలను, మరో 160 మంది కాంట్రాక్ట్ మరియు ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ హోదాల్లో పనిచేస్తున్నారు. క్యాంపస్ విద్యలో వీరి పాత్ర ముఖ్యమైనప్పటికీ, వర్సిటీ పాలనాధికారుల వైఖరి పట్ల అధ్యాపకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏయూలోనే ఎందుకలా..

రాష్ట్రంలోని ఇతర విశ్వవిద్యాలయాలు యూజీసీ నిబంధనల ప్రకారం గెస్ట్ ఫ్యాకల్టీలకు నెలకు రూ.45,000 వరకు వేతనాలు చెల్లిస్తుండగా, ఆంధ్ర యూనివర్సిటీలో మాత్రం సెమిస్టర్‌కు రూ.45,500 మాత్రమే ఇస్తున్నారు. ఇది నెలకు రూ.7,500 నుంచి రూ.15,000 మధ్య ఉంటుంది. అంతేకాకుండా, ఈ వేతనాలు కూడా ఆలస్యంగా అందుతున్నాయని అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు. ఇతర చోట్ల నెలకు రూ.50,000 వరకు వేతనం పొందుతుంటే, ఏయూలో తమకు ఎందుకు తక్కువ ఇస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం లేదని వారు చెబుతున్నారు.

సిఫార్సు ఫ్యాకల్టీలతోనే చిక్కులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వర్సిటీ పునరావాస కేంద్రంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు నాయకుల సిఫార్సులతో అవసరం లేకున్నా గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించారని, ఇప్పుడు వారిని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. పీజీ, పీహెచ్‌డీ అర్హతలు కలిగి ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను ఇలా అవమానించడం సరికాదని అధ్యాపకులు అంటున్నారు.

నెలవారీ వేతనాలు ఇవ్వాలి

గెస్ట్ ఫ్యాకల్టీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సురేష్ మీనన్ మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు. సిక్‌మెన్ కమిటీ ద్వారా ఎంపికైన తమను అర్హతలు లేని వారిలా చూడటం బాధాకరమన్నారు. అర్హతలు లేని వారిని తొలగించవచ్చని, కానీ అర్హులైన తమకు కూడా ఇతర విశ్వవిద్యాలయాల మాదిరిగా నెలవారీ వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాల పరిశీలన

మహారాణిపేట: యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పరిశీలించారు. ఆదివారం పరీక్ష జరగనున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఆయన ఏవీఎన్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలతో పాటు వివిధ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, యూపీఎస్సీ నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.అంతకుముందు ఏవీఎన్ కళాశాలలో జరుగుతున్న ఇన్విజిలేటర్ల శిక్షణను పరిశీలించిన కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు.



ఏవీఎన్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

రికార్డులు తిరగరాసేలా యోగా డే

మంత్రులు డోలా, అనిత

మహారాణిపేట: నగరంలో జూన్ 1న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గత రికార్డులు తిరగరాసేలా ఘనంగా నిర్వహించాలని మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏర్పాట్లపై చర్చించారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26.5 కి.మీ మేర 2.5 లక్షల మందితో యోగా నిర్వహించి గిన్నిస్ రికార్డు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షం వస్తే ఏయూ మైదానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సాధారణ పౌరులు, ఉద్యోగులు, విద్యార్థులు, యోగా సంఘాలు, వ్యాపారులు, నేవీ, కోస్ట్ గార్డ్ తదితరులు పాల్గొనాలని మంత్రులు కోరారు. విశాఖ ఖ్యాతిని ప్రపంచానికి చాటే ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు. 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యోగా కార్యక్రమంలో 175 దేశాలు పాల్గొంటాయని, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని హోం మంత్రి వంగలపూడి అనిత కోరారు. మీడియా సహకారం కూడా కోరారు.

26.5 కి.మీ.మేర..

యోగా దినోత్సవంలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26.5 కి.మీ మేర కంపార్టుమెంట్లకు వెయ్యి మంది చొప్పున మొత్తం 2.5 లక్షల మంది పాల్గొంటారని కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. గిన్నిస్ రికార్డు కోసం అందరూ ఒకే వేదికపై ఉండాలని స్పష్టం చేశారు. ప్రధాన వేదిక కాళీమాత టెంపుల్ నుంచి వైఎంసీఏ వరకు ఉంటుందని, తాగునీరు, టాయిలెట్ల ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు. ప్రధాన రహదారిపై 1.24 లక్షలు, మరో 25 వేదికల్లో మిగిలిన వారు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్‌లు వేపాడ చిరంజీవి రావు, గణబాబు, ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్.టి.ఆర్. వైద్య సేవా ట్రస్టు చైర్మన్ సీతారామరాజు సుధాకర్, ఏపీ గ్రోవర్స్ ఆయిల్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, విశాఖ ఆర్డీవో పి. శ్రీలేఖ, నేవీ, కోస్టల్ గార్డు, ఇతర జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు డోలా వీరాంజనేయ స్వామి, హోం మంత్రి అనిత

బీబీఏలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి బీబీఏ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఏయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డీన్ ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. సెల్ఫ్ సపోర్టింగ్ ప్రోగ్రామ్ కింద బీబీఏతో పాటు ఎంబీఏ పూర్తి చేసే అవకాశం ఉంది. ఈ నెల 26 నుంచి జూన్ 13 వరకు విద్యార్థులు పోస్ట్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు www. audoa.andhrauniversity. edu.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

రుషికొండలో బోటు షికారు పునఃప్రారంభం



బోటు షికారుకు సిద్ధమవుతున్న పర్యాటకులు

కొమ్మాది: ప్రతికూల వాతావరణం కారణంగా నాలుగు రోజులుగా నిలిచిపోయిన రుషికొండ బోటు షికారును శనివారం వాతావరణం అనుకూలించడంతో తిరిగి ప్రారంభమైందని నిర్వాహకులు తెలిపారు. వాతావరణంలో మార్పులు వస్తే తాత్కాలికంగా నిలిపివేస్తామని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గజానికో గుంత..!



తాజాగా కురిసిన వర్షాలకు వేపగుంట-పినగాడి రోడ్డు దుస్థితి

గ్రౌండ్ సాక్షి రిపోర్ట్

అడుక్కో గుంత.. కంకర తేలిన రోడ్లు.. జిల్లాలోని రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. వీటిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. కనీస మరమ్మతులు సైతం చేపట్టక పోవడంతో కాలు పెట్టలేని స్థితిలో ఉన్నాయి. పగలు అష్టకష్టాలు పడి రాకపోకలు సాగిస్తున్నా.. రాత్రుళ్లు మాత్రం ఆయా రోడ్లపైకి వెళ్లేందుకు భారీ వాహన చోదకులు సైతం భయపడుతున్నారు. మొన్నటి సంక్రాంతి నాటికి అన్ని రహదారులకు మరమ్మతులు పూర్తి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడుస్తున్నా ఈ దిశగా తీసుకున్న చర్యలు కానరావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

-జోన్ పేజీల్లో ..

నేడు 68 మంది సంగీత కళాకారులకు సత్కారం


మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో 68 మంది సంగీత కళాకారులకు సత్కరించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. గాత్రం, వయోలిన్, మృదంగం, లైట్ మ్యూజిక్, డివోషనల్ మ్యూజిక్, వాద్య పరికరాలు, డోలు విభాగాల్లో నిష్ణాతులైన కళాకారులను గుర్తించి సత్కరిస్తున్నామన్నారు.కళాకారులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అప్పన్న సన్నిధిలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అనంతరం, అంతరాలయంలో అర్చకులు ఆమె పేరిట అష్టోత్తర పూజ నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవస్థానం ఇన్‌చార్జి ఈవో ఎస్. సుజాత వారికి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రం అందజేశారు.



నీలం సాహ్నికి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న దేవస్థానం ఇన్‌చార్జి ఈవో సుజాత



యోగాతో ఆరోగ్యం సాధ్యం



ఏయూక్యాంపస్: నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యం సొంతమవుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాం జయే స్వామి అన్నారు. యోగా డే పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా భారతీయ వ్యవస్థలో అంతర్భాగమని, యోగా సాధన కూడా దైనందిన జీవితంలో ఒక భాగంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యమే నిజమైన ఆస్తి అని అన్నారు. ప్రజల్లో ఆరోగ్య భద్రత పెరిగిందని, పాత తరం ఆహారపు అలవాట్ల వైపు నేటి తరం అడుగులు వేస్తోందన్నారు. ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా విశాఖలో జరిగే కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవం విశాఖలో నిర్వహిస్తుండటం గర్వకారణమన్నారు. ప్రతి రోజూ గంట సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. భవిష్యత్ తరానికి యోగాను అందించడం ఎంతో అవసరమన్నారు. రికార్డు స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అందరినీ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా నెల రోజుల పాటు జరిగే యోగా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం బ్రహ్మకుమారీ సంస్థల సభ్యులు ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, డీసీపీలు అజిత వేజెండ్ల, మేరీ



యోగాసనాలు వేస్తున్న మంత్రులు డోలా శ్రీ బాలవీరాంజనేయ, అనిత, ఎమ్మెల్యేలు, అధికారులు, నగరవాసులు

ప్రశాంతి, ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, నేవీ ఉన్నాధికారులు, పోలీస్ శాఖ అధికారులు, యోగా శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం యోగా శిక్షకుల పర్యవేక్షణలో పలు ఆసనాలు వేశారు.

యోగా శిక్షకులుగా నమోదుకు అవకాశం

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి కలిగిన వారు ప్రత్యేక లింకు ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని ఆయుష్ విభాగం ప్రాంతీయ ఉప సంచాలకులు ఝాన్సీ లక్ష్మీ భాయి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల శిక్షకులు https://yogandhra.ap.gov.in/#/home/yoga& registration అనే లింక్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇలా రిజిస్టర్ చేసుకుని ప్రజలకు యోగా నేర్పించిన వారికి మొరార్జీ దేశాయ్ నేషనల్ యోగా ఇన్‌స్టిట్యూట్‌చే ధ్రువపత్రాలు అందజేస్తారన్నారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

విశాఖ విద్య: విశాఖలో జూన్ 21న నిర్వహించతలపెట్టిన యోగాంధ్రలో విద్యాశాఖ తరఫున ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి ఆదేశించారు. విశాఖ వ్యాలీ పాఠశాలలో శనివారం విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లతో ఆయన సమావేశమయ్యారు. జూన్ 21న ఆర్కే బీచ్ లో నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లకు తగిన ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రతీ ఒక్కరు వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. విశాఖపట్నం నుంచి భీమునిపట్నం వరకు మధ్యలోని అన్ని పాఠశాలలలో 8, 9, 10 విద్యార్థులను తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో భాగం చేయాలన్నారు. అదే విధంగా ఏ ఏ ప్రాంతాలను ఏ ఏ పాఠశాలల విద్యార్థులకు కేటాయించాలనే దానిపై పలు సూచనలు చేశారు. ఆర్జేడీ బి.విజయ భాస్కర్, ఎస్జీఎఫ్ స్టేట్ సెక్రటరీ భానుమూర్తి రాజు, డీఈవో ఎస్.ప్రేమ కుమార్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జోగ చంద్ర శేఖర్ రావు, సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, మూడు జిల్లాల ఎస్జీఎఫ్ సెక్రటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగ్రవాద నిర్మూలనలో కేంద్రం విఫలం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- కేంద్రం తీరును నిరసిస్తూ సమైక్యతా యాత్ర



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

బీచ్‌రోడ్డు: పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మరణించి నెల రోజులు గడుస్తున్నా ఒక్క ఉగ్రవాదిని కూడా పట్టుకోలేకపోవడం కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. మత సామరస్యం, దేశ సమగ్రత కోసం ప్రజలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లోని గురజాడ అప్పారావు విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ జాతీయ జెండాతో సమైక్యతా యాత్ర నిర్వహించారు. కళాకారులు కోలాటం, చిన్నారులు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వేషధారణలతో భారతదేశ చిత్రపటాన్ని ప్రదర్శించారు. ఈ యాత్రలో శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్'పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని చెప్పుకున్న మోదీ ప్రభుత్వం.. దాడి చేసిన ఉగ్రవాదులను పట్టుకోలేకపోయిందని ఆరోపించారు. ఉగ్రవాద మూలాలను నిర్మూలించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఎన్డీఏ కూటమి ఉగ్రవాద దాడిని మతపరమైన యుద్ధంగా చిత్రీకరించడం దేశ ఐక్యతకు ప్రమాదకరమన్నారు. ఉగ్రవాదుల దాడులను దేశం ముక్తకంఠంతో ఖండించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిణామాలపై పార్లమెంట్‌లో చర్చించకుండా.. అమెరికా అధ్యక్షుడిని సంప్రదించి యుద్ధం ఆగిపోయిందని చెప్పడం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టడమేనని విమర్శించారు. బీజేపీ, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు తిరంగా యాత్రలు నిర్వహిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయని, ముస్లిం మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆయన ఆరోపించారు. దేశ సమైక్యత, మత సామరస్యం కోసం ఈ నెల 20 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా సమైక్యతా యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లా సీపీఎం కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.పద్మ, జిల్లా కార్యదర్శి సభ్యులు బి.జగన్, పి.మణి, వి.కష్టారావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, పి.వి.ఎస్.పి.శ్రీనివాసరాజు, టి.పైడ్రాజు, పి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని దివీస్ ఉద్యోగిని దుర్మరణం



ప్రమాదానికి కారణమైన కారు



మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది



తిరుమలాదేవి(ఫైల్)

తగరపువలస: సంగివలస వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా చాట్రాయ్ మండలం ఎర్రవారిగూడేనికి చెందిన ఉప్పలపాటి తిరుమలాదేవి (24) అక్కడికక్కడే మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలివి.. కోనసీమ జిల్లా ద్రాక్షారామానికి చెందిన పిల్లి వెంకటేష్ ఫార్చ్యూనర్ కారులో కాకినాడ నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వైపు వెళ్తున్నారు. కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంతో సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం సమీపంలో అదుపు తప్పిన డివైడర్‌ను దాటి అవతలి వైపునకు దూసుకెళ్లింది. ఇదిలా ఉండగా.. భీమిలి మండలం చిప్పాడలోని దివీస్ లేబొరేటరీలో కెమిస్ట్‌గా పనిచేస్తున్న తిరుమలాదేవి విధులకు హాజరయ్యేందుకు మరో ముగ్గురు సహోద్యోగినులతో కలిసి అనిట్స్ బస్టాప్ వద్దకు చేరుకుంది. తాము ఎక్కాల్సిన ప్రైవేట్ బస్సు అప్పటికే ఆనందపురం వైపు వెళ్లిపోయింది. ఆనందపురం వైపు నుంచి తిరిగి వస్తున్న అదే బస్సును పట్టుకోవడానికి ఆమె రోడ్డు దాటుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కారు తిరుమలాదేవిని బలంగా ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకుపోయింది. ఈ ఘటనలో ఆమె తల ఛిద్రమై తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. మిగతా ముగ్గురు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. తిరుమలాదేవి మూడేళ్లుగా దివీస్‌లో కెమిస్ట్‌గా పని చేస్తున్నారు. సంగివలసలోని ఆరాధ్య హాస్టల్‌లో ఉంటూ విధులకు హాజరవుతున్నారు. ఆమెకు ఇంకా వివాహం కాలేదు. సమాచారం అందుకున్న భీమిలి ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద విషయంపై దివీస్ యాజమాన్యానికి, మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దివీస్ ఉద్యోగి కడియాల పవన్‌కుమార్ ఫిర్యాదుతో ఎస్ఐ రాధాకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





నేడు జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు

బీచ్‌రోడ్డు: వైజాగ్ మీడియా అవార్డ్స్, స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఆదివారం జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు, స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు నిర్వాహక కమిటీ చైర్మన్ గంట్ల శ్రీను బాబు, చీఫ్ ఆర్గనైజర్ ఆర్.నాగరాజు పట్నాయక్ తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఉదయం 9 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో ఎంబీఏ, ఎంబీబీఎస్, ఎంఎల్, బీఎల్, నర్సింగ్, ఇంజినీరింగ్ చదువుతున్న 33 మందికి, అలాగే బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, డ్యాన్స్, మ్యూజిక్ వంటి విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మరో పది మంది జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు, డిగ్రీలో అత్యధిక మార్కులు సాధించిన 121 మంది జర్నలిస్ట్ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని పేర్కొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా



విజయ్(ఫైల్)



మృతదేహాన్ని బయటకు తీస్తున్న లైఫ్‌గార్డులు

పెందుర్తి: స్నేహితులతో కలిసి మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కు సరదాగా ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి.. 93వ వార్డు ప్రహ్లాదపురానికి చెందిన దాసరి విజయ్‌కుమార్(41) స్థానికంగా ఉన్న కొందరు స్నేహితులతో కలిసి శనివారం ఉదయం మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌కు వెళ్లాడు. అక్కడ పార్టీ చేసుకున్నారు. అనంతరం స్నేహితులతో కలిసి రిజర్వాయర్‌లో ఈదుతున్న సమయంలో విజయ్‌కుమార్ గల్లంతయ్యాడు. దీంతో అతడి స్నేహితులు గజ ఈతగాళ్లకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న జీవీఎంసీ లైఫ్‌గార్డులు విజయ్‌కుమార్ కోసం గాలించగా.. మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతదేహం లభించింది. పెందుర్తి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం విజయ్ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు విజయ్ స్థానికంగా చిన్నపాటి కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎంసీకి పార్థివదేహం దానం



సోములు మృత దేహాన్ని ఏఎంసీ అనాటమీ విభాగానికి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు



సోములు(ఫైల్)

మహారాణిపేట/సబ్బవరం: సీపీఎం నాయకుడు సబ్బవరపు సోములు(87) పార్థివదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఏఎంసీకి అప్పగించారు. సబ్బవరం మండలం రావలమ్మపాలేనికి చెందిన సోములు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. అభ్యుదయ భావాలున్న సోములు పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. తన మరణానంతరం తన శరీరం ఇతరులకు ఉపయోగపడాలని కోరుకున్నారు. జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా తన పార్థివ దేహాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల అనాటమీ విభాగానికి, కళ్లను మోహిసిన్ ఐ బ్యాంక్‌కు అప్పగించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సోములు మృతదేహాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల అనాటమీ విభాగానికి అప్పగించారు. సోములుకు ఇద్దరు కుమార్తెలు రాములమ్మ, దేముడమ్మ, నలుగురు మనవరాళ్లు, మనవళ్లు, మునిమనవళ్లు ఉన్నారు. అల్లుడు జక్కాన సత్యనారాయణ సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ సభ్యుడిగా, వీడీఎల్‌బీ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, పి.మణి, నాయకులు బి.రమణి, బి.వెంకటరావు, డాక్టర్ లక్ష్మణరావు, జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ సభ్యులు గట్టు సుబ్బారావు, ఎం.వి.నారాయణ, పోర్టు సీఐటీయూ యూనియన్ నాయకులు సోములు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మలేసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 'విశాఖ' ప్రతిభ

మురళీనగర్: మలేసియాలో జరుగుతున్న 37వ మలేసియన్ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖపట్నం వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (వావ్) క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. పోటీల ప్రారంభంలోనే వారు 5 బంగారు, 2 వెండి, 2 కాంస్య పతకాలు సహా మొత్తం 9 పతకాలు సాధించినట్లు ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్ తెలిపారు. మహిళల విభాగం డిస్కస్ త్రో, షాట్ పుట్‌లో హెచ్.ఎం.సుజాత (67+) రెండు స్వర్ణాలు, జావెలిన్ త్రోలో కె.మత్స్యకొండ (55+) స్వర్ణం, కె. పూర్ణిమ (40+) డిస్కస్ త్రోలో వెండి, జావెలిన్ త్రోలో కాంస్యం సాధించారు. పురుషుల విభాగంలో ఆర్.మంజునాథ్ (35+) 800 మీటర్లు, 1500 మీటర్ల పరుగులో రెండు స్వర్ణాలు, కె.బి.వి.వి.ఎం ప్రసాద్ (40+) జావెలిన్ త్రోలో కాంస్యం గెలుచుకున్నారు. వావ్ చీఫ్ పేట్రన్ కమల్ బైద్, వరల్డ్ టీచర్ ట్రస్ట్ డైరెక్టర్ సిహెచ్. సత్యదేవ్, కో–ఆర్డినేటర్ సిహెచ్. శ్రీనివాసరాజు, కార్యదర్శి ఎల్వీ సుధాకర్ తదితరులు విజేతలను అభినందించారు.

కేబీఆర్‌లో బాలుడి మృతదేహం లభ్యం



యశ్వంత్ మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్)లో శనివారం బాలుడి మృతదేహం బయటపడింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి. అగనంపూడి దరి శనివాడ ప్రాంతానికి చెందిన చట్టి పైడిరాజు కుమారుడు చట్టి యశ్వంత్ (13) శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో స్నేహితులతో బయటకు వెళ్లాడు. వారితో ఆడుకుంటుండగా, అగనంపూడి ఏలేరు కాలువలో పడి కొట్టుకుపోయాడు. కాలువ ప్రవాహానికి బాలుడు కేబీఆర్‌లోకి కొట్టుకొచ్చాడు. రిజర్వాయర్ వద్ద మృతదేహాన్ని గుర్తించిన సిబ్బంది స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి.. బాలుడి ఫొటోను వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశారు. సాయంత్రం అయినా యశ్వంత్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా వాకబు చేశారు. ఆ క్రమంలో వాట్సాప్ గ్రూప్‌లో యశ్వంత్ ఫొటో చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఇదిలా ఉండగా ఎంత మంది ఆటకు వెళ్లారు? ప్రమాదంలో కాలువలో జారి పడిపోయాడా? మరే ఇతర కారణం ఉందా అనే కోణంలో స్టీల్‌ప్లాంట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.